క్లుప్తంగా

లలితా పీఠంలో చండీ హోమం



చండీ హోమం చేస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో వైశాఖ మాసం, బహుళ అష్టమి సందర్భంగా శుక్రవారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. వేద పండితులు గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం చేసినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేస్ తెలిపారు. హనుమత్ జయంతి సందర్భంగా శనివారం ఉదయం మన్యు పాశుపత హోమం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



స్టాల్ టోకెన్ అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని 66 స్టాళ్లకు శుక్రవారం డ్రా తీశారు. ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు రైతులకు స్టాళ్ల టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు వారికి కేటాయించిన స్టాళ్లలోనే వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు.

బంగారం, వెండి ఆభరణాల చోరీ

మత్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటన వెలుగుచూసింది. క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలో కుటుంబంతో కలిసి ఉమ్మడిశెట్టి రామారావు నివసిస్తున్నారు. వేసవి కాలం వేడి ఎక్కువగా ఉన్న కారణంతో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు గురువారం రాత్రి ఇంటి మేడ మీద నిద్రపోయారు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. బీరువాలోని ఉన్న మూడున్నర తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులు కనిపించలేదు. వెంటనే వారు పోలీసులను ఆశ్రయించారు. శుక్రవారం బాధితుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో క్రైం ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు.

రైల్వేస్టేషన్‌లో 8 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి రవాణ చేస్తున్న నిందితుడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. విశాఖ రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన ఎల్.సి.రవీంద్ర విశాఖ మీదుగా ముంబైకి రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన రూ.40 వేల విలువైన 8 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

డాక్టర్ బాబ్జీకి బాల సాహిత్య సేవారత్న అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న బాబ్జీ

మద్దిలపాలెం: మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, కవి, రచయిత, కళాకారుడు డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీకి మరో అవార్డు దక్కింది. హైదరాబాద్ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సేవారత్నం అవార్డుకు ఎంపికయ్యారు. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, డాక్టర్ వరప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆయన అవార్డును స్వీకరించారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

- నేడు ఆంజనేయుడికి విశేష పూజలు
- ముస్తాబైన ఆలయాలు



పట్టాభిరెడ్డితోటలో దాసాంజనేయస్వామి



సూర్యానగర్-2లో విద్యుద్దీపాలంకరణలో యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయం

మురళీనగర్: హనుమజ్జయంతి వేడుకలకు నియోజకవర్గంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామిని కొలిచేందుకు సర్వం సిద్ధం చేశారు. హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం సూర్యానగర్-2 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న యోగ సిద్ధాంజనేయ ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకం చేశారు. పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో మంగళధ్వని, వేద మంత్రాల నడుమ స్వామివారికి విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు, హోమాలు ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం అనంతరం అష్టోత్తర శతకలశ స్నపనం, అభిషేకాలు జరిపారు. భక్తులచే సామూహిక సుందరకాండ పారాయణం అనంతరం తమలపాకులతో అర్చన, సింధూర అర్చన నిర్వహించి, స్వామివారికి ధూప దీప నైవేద్యం, దివ్య మంగళ హారతి, మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు అన్నసమారాధన

శనివారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక అలంకరణతో యోగ సిద్ధాంజనేయ స్వామివారి దివ్య దర్శనం కల్పిస్తారు. లోక కల్యాణార్థం సీతారామ కల్యాణం నిర్వహిస్తామని, అనంతరం అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ పి.సుబ్బరాజు తెలిపారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

దాసాంజనేయ స్వామి ఆలయంలో..

మురళీనగర్ సమీపాన పట్టాభిరెడ్డితోటలో వెలసిన గణపతి సంయుక్త దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రధాన అర్చకుడు ఆరవిల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 5 గంటలకు మంగళధ్వని, 5.30కు సుప్రభాత సేవ, 6.30 విశేష అలంకరణలో దాసాంజనేయ స్వామి దర్శనం ఉంటుంది. ఉదయం 7 గంటలకు ప్రత్యేక అర్చన, అనంతరం తమలపాకులతో పూజ, సింధూరార్చన, 9.30కు హనుమత్ జయంతి నిర్వహిస్తారు.

నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో..

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వెంకటేశ్వర, అయ్యప్ప, శ్రీ షిర్డీసాయిబాబా దేవాలయంలో శనివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆంజనేయ స్వామికి మన్యు సూక్త హోమం నిర్వహిస్తామని ప్రధాన అర్చకుడు రాజాస్వామి తెలిపారు. పూర్ణాహుతి అనంతరం స్వామికి అభిషేకం, సాయంత్రం 6 గంటలకు సింధూర, తమలపాకుల పూజలు చేస్తామన్నారు.




యోగసిద్ధాంజనేయుడికి పంచామృతాభిషేకం చేస్తున్న శేషాచార్యులు



స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

అభయాంజనేయం



సీతమ్మధార కొండవాలులో కొలువైన 108 అడుగుల అభయాంజనేయుడు

సీతమ్మధార: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలో కొలువైన 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ఎ.ఎస్.ఎన్.రాజు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, అస్త్ర రాజార్చన, మహన్యాస పూర్వక మన్యు సూక్త హోమం, పంచామృతాభిషేకం, దశ సహస్ర సింధూరార్చన, దశ సహస్ర నాగవల్లి ధళ పూజలు, నీరాజన మంత్ర పుష్పాలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ఆవరణలో మల్లిడి చక్రవర్తి, లక్ష్మి దంపతుల సౌజన్యంతో ప్రసాద వితరణ జరుగుతాయని చెప్పారు.

ధూమపాన నిషేధంపై కఠిన చర్యలు అవసరం



సిగరెట్ యాస్ట్రేల ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు

సీతమ్మధార: ధూమపాన నిషేధంపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని లయన్స్ క్లబ్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ వి.ఉమామహేశ్వర రావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం సీతమ్మధారలోని లయన్స్ క్లబ్ ఆస్పత్రిలో ధూమపాన నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఉద్యోగి జి.ఎస్.శివప్రకాష్ సేకరించిన రాజుల కాలం నుంచి ఇప్పటి వరకు వినియోగించే వివిధ రకాల సిగరెట్ యాస్ట్రేల ప్రదర్శన అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ముందుగా జ్యోతిప్రజ్వలను చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినోత్సవం ఒక్కరోజు కాదని.. నిరంతర ప్రక్రియగా పాటించాలన్నారు. తద్వారా తమ ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఎదుట వారి ప్రాణరక్షణకు దోహదపడాలన్నారు. కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తేనే ధూమపానాన్ని నిషేధించడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో జీఆర్ నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.మూర్తి, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది, ఆస్పత్రి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఫ్రైడే-డ్రైడే అమలు

- ప్రజా భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన
- జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్



పూల కుండీ ట్రేలో పెరుగుతున్న దోమ లార్వాలను పరిశీలిస్తున్న తులసీరాజ్

సీతంపేట: నగరంలోని ప్రతి సచివాలయం పరిధిలో పూర్తిస్థాయిలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం అమలయ్యేలా చూడాలని సిబ్బందిని జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ ఆదేశించారు. 25వ వార్డు శాంతిపురంలో శుక్రవారం ఉదయం ఫ్రైడే-డ్రైడే అమలు తీరును క్షేత్రస్థాయిలో ఆమె పర్యవేక్షించారు. జీవీఎంసీ, మలేరియా సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. దోమ లార్వాలు పెరుగుతున్న ప్రదేశాలను గుర్తించారు. ఈ సందర్భంగా తులసీరాజ్ మట్లాడుతూ ఫ్రైడే-డ్రైడేను పటిష్టంగా అమలు చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టి తద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాల నియంత్రించవచ్చని చెప్పారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా ఉండి నీటి నిల్వల్లో దోమ లార్వాలను నాశనం చేయాలన్నారు. వారానికి ఒకసారి నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, డ్రమ్ములు, సంపులు, ట్యాంకులు శుభ్రం చేసి మళ్లీ నీరు పట్టుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజల అవగాహన, భాగస్వామ్యంతోనే దోమల వృద్ధిని అరికట్టగలమన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, హెల్త్ అసిస్టెంట్లు ఎల్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరెడ్డి, శివ, ఏఎన్ఎం, ఆశా, యాంటీ లార్వా సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్



ఈకార్వో సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న అతిథులతో చిన్నారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో నెల రోజులుగా అనురాగ్ మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రైల్ క్లబ్‌లో ముగింపు వేడుకలు నిర్వహించారు. సమ్మర్ క్యాంప్‌లో వివిధ వయసు గ్రూప్‌ల విద్యార్థినీ, విద్యార్థులకు కరాటే, యోగా, ఫొనెటిక్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, డాన్స్, కీ బోర్డ్, సంగీతం వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా సమ్మర్ క్యాంప్ ఉంటుందని, దీనిని నిర్వహించిన ఈకార్వోను ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన చిన్నారులకు డీఆర్ఎం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, వైస్ ప్రెసిడెంట్లు కవితాగుప్తా, మధుస్మిత సాహు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు



రోడ్డుపై వ్యాపారాలను తొలగిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రసాద్, సిబ్బంది

మత్రిపాలెం: గత నాలుగు రోజులుగా కంచరపాలెం పరిధిలో పోలీసులు వాహనాలపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించినట్టు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి కూడలి వరకు బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు చేపట్టారు. పాదచారులకు ఇబ్బంది కలిగించేలా ఉన్న బడ్డీలు, తోపుడు బళ్లను కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు జీవీఎంసీ సిబ్బందితో కలిసి తొలగించారు. వారు అలా వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, తద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని సీఐ ప్రసాద్ అన్నారు. పాదచారులు కూడా ఫుట్‌పాత్‌లపై నడవడానికి అవస్థలు పడుతున్నారన్నారు. జీవీఎంసీ సిబ్బంది వారికి జరిమానాలు విధించినట్టు చెప్పారు. మూడు రోజులుగా నిబంధనలు ఉల్లంఘించి రాంగ్ పార్కింగ్, రేష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, తదితర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేసి 523 వాహనదారులకు జరిమానాలు విధించినట్టు ఆయన తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని సంతోషికి ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార: ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ పేద విద్యార్థినికి కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. విజయనగరం జిల్లా గుసిని గ్రామానికి చెందిన పీతల సంతోషి హెచ్‌బీ కాలనీలోని కైట్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. రేసపువానిపాలెంలోని ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం విద్యార్థినికి ట్రస్ట్ తరపున నగదు సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పది మంది విద్యార్థులకు రూ.50 వేల ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. ల్యాప్‌టాప్‌తోపాటు ఇతర సహాయం ట్రస్ట్ ద్వారా అందించినట్లు చెప్పారు.

మజ్జిగ పంపిణీ

జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం రహదారిలో కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు ప్రత్యేక పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మహిళలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు రక్తపోటు, మధుమేహం, నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. న్యూలైఫ్, రక్తనిధి, ఓమ్నీ ఆర్కే, ఐ విజన్ సంస్థలు, కాలనీ యువత పాల్గొన్నారు.

రామకోటి సేవలు ఆదర్శనీయం



రామకోటి అప్పారావు దంపతులను సత్కరిస్తున్న మలేరియా అధికారి తులసి రాజ్

సీతంపేట: వైద్య ఆరోగ్య శాఖలో 26 ఏళ్ల పాటు అంకితభావంతో ప్రజలకు సేవలందించిన పి.రామకోటి అప్పారావును సహచర ఉద్యోగులంతా ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తులసి రాజ్ అన్నారు. రామకోటి అప్పారావు పదవీ విరమణ ఆత్మీయ వీడ్కోలు సమావేశం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల్లో కష్టపడి పనిచేసిన రామకోటి ఉన్నతాధికారుల మన్ననలతో పాటు డిపార్ట్‌మెంట్‌లో మంచి పేరు సంపాదించారన్నారు. చిన్న స్థాయి నుంచి సూపర్‌వైజర్ స్థాయి వరకు ఎదిగారని, కరోనా విపత్తు కాలంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని ప్రశంసించారు. రామకోటి ఉన్నతి వెనుక ఉన్న ఆయన భార్య కోటి లక్ష్మి, కుటుంబ సభ్యుల సహకారాన్ని అభినందించారు. పదవీవిరమణ అనంతరం శేషజీవితాన్ని ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం రామకోటి అప్పారావు, లక్ష్మి దంపతులను దుశ్శాలువా, గజమాలతో సత్కరించి సన్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు శ్రీనివాసాచారి, శేషుబాబు, నాగశ్రీను, వెంకటేష్, యూనియన్ నాయకులు రమణ, ఎస్.వి.రమణ, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తులసి స్ఫూర్తితో పోరాడాలి



తులసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

మత్రిపాలెం: అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు వై.తులసి ఎంతగానో శ్రమించారని, ప్రతి ఒక్కరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. ఇటీవల హఠాన్మరణం చెందిన తులసి సంతాప సభ శుక్రవారం మత్రిపాలెం ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ తులసి మృతి ఇటు యూనియన్‌ను.. అటు ఆమె కుటుంబాన్ని కలచి వేసిందని, అందరికీ తీరని లోటన్నారు. అంగన్‌వాడీ సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు నూకరత్నం, వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ జ్యోతి, తదితర యూనియన్ లీడర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దళితులపై వివక్ష తగదు



నిరసన తెలుపుతున్న గొల్లమాల అప్పారావు, దళిత సేన నాయకులు

కంచరపాలెం: దళితులపై వివక్ష చూపడం అమానుషమని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సిద్దిపేటలో జరిగిన కుల వివక్ష ఘటనపై శుక్రవారం కంచరపాలెం దళిత సేన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులు హనుమాన్ మాల ధరించి గుడిలో పూజ చేయడానికి వెళ్లగా.. అగ్ర కులస్తులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. సీతారామ్‌పల్లిలో అగ్ర కులస్తులు దళితులను తక్కువ కులస్తులంటూ దూషించడం.. యావత్ భారతదేశం తలదించుకునేలా ఉందన్నారు. గుడి, బడి, గ్రామ ఆస్తులపై ప్రతి పౌరుడికి హక్కు ఉందన్నారు. ఇటువంటి సంఘటనలు ఎక్కడా జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అప్పారావు కోరారు. కార్యక్రమంలో సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి చింతలా మల్లికార్జునరావు, కోశాధికారి లంకా రామారావు, నగర కార్యదర్శి పట్నాల ఝాన్సీ, నగర కన్వీనర్ గొల్లమాల మీనా, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జూనియర్ ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

గోపాలపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ శుక్రవారం నిర్వహించారని, ఈ కౌన్సెలింగ్ ఉమ్మడి జిల్లా గురుకుల సమన్వయకర్త ఎస్ రూపవతి చైర్మన్‌గా వ్యవహరించారని మేహాద్రి గెడ్డ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ మృదుల ప్రియదర్శిని తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 7 మహిళా గురుకులాల్లో జూనియర్ ఇంటర్‌లో సీట్ల భర్తీకి అడ్మిషన్ కౌన్సెలింగ్ స్పాట్ అడ్మిషన్లు జరిగాయి. జిల్లాలో మేహాద్రి గెడ్డ, సీవోఈ మధురవాడ, నక్కపల్లి, కోనాం తాళ్లపాలెం, నర్సీపట్నం, కొక్కిరాపల్లి గురుకులాల్లో 73 సీట్లను గాను సుమారు 200 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ ఖాళీలు మెరిట్ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుగుణంగా భర్తీ చేశారు.

ధ్యాన మందిరంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కృష్ణ అభిమానులు

తాటిచెట్లపాలెం: తెలుగు సినీ దిగ్గజ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు శుక్రవారం కృష్ణ ఫ్యాన్స్ మాజీ అధ్యక్షుడు కె.కమల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమల్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర రంగంలో మొదటి సినిమా స్కోప్, 70ఎంఎం, కలర్‌లను పరిచయం చేసిన నటశేఖరుడు కృష్ణ అని కొనియాడారు. మేడపాటి నందకిషోర్, తమ్మిన శ్రీకాంత్, పి.వి.రమణారెడ్డి, కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.